# నీతో...

- ఎమ్మెస్వీ గంగరాజు

శంకరం హఠాత్తుగా చచ్చిపోయాడు. ఉదయాన్నే కాఫీ తాగి హాల్లో కూర్చుని పేపరు చూస్తూ కళ్ళు మూసుకున్నాడు. అంతే! అలా మూసుకున్న కళ్ళు మరి తెరువలేదు. శాశ్వత నిద్రలోకి జారిపోయాడు.

అంతటి గొప్ప మరణం ఎంతో పుణ్యం చేసుకున్న వ్యక్తులకుగానీ లభ్యం కాదన్నారు చుట్టూ చేరిన జనం. అవును, నిజమే మరి! శంకరం చీమకు కూడా అపకారం తలపెట్టని ఉత్తమోత్తముడు. కింది స్థాయి నుండి అందరి మన్ననలూ పొందుతూ అంచెలంచెలుగా ఎదిగిన కష్టజీవి.

'పాపి చిరాయువు' అంటారు. చిరకాలం ఉండే వాళ్ళంతా పాపాత్ములు కారు. కానీ పాపాత్ములు చిరకాలం ఉంటారుట. మంచివాళ్ళెప్పుడూ భగవంతునికి ప్రియులే. అందుకే శంకరాన్ని అర్ధాంతరంగా భగవంతుడు తనవద్దకు పిలిపించేసుకున్నాడు. పాపం శంకరం కోరికలు ఈడేరుతున్న సమయంలోనూ, తనకోసం కాకపోయినా తనవారి కోసం ఆశించిన సౌఖ్యాలు సమీపంలోనున్న తరుణంలోనూ!

ఏడ్చి ఏడ్చి సునంద కళ్ళు ఉల్లిపాయల్లా ఉబ్బిపోయాయి. లోపల నీరు ఇంకిపోయింది. చెంపలమీద చారికలు మిగిల్చి పచ్చటి పసిమి ఛాయతో మెరిసిపోయే చెంపలు వెచ్చని కన్నీటికి కమిలిపోయి కందిపోయినట్టున్నాయి.

పాతిక సంవత్సరాల క్రితం సునంద సమస్త భోగభాగ్యాలూ అనుభవిస్తూ పెరిగిన ఒక సంపన్న కుటుంబపు గారాలపట్టి. అయితే శంకరం వ్యక్తిత్వం ముందు ఆ భోగభాగ్యాలు దిగదుడుపేనని ఖచ్చితంగా చెప్పి శంకరంతో ఏడడుగులూ నడిచి వచ్చేసిన ప్రేమమూర్తి.

''లక్షణంగా ఒక మంచి ఇంజనీర్నో, డాక్టర్నో ఇచ్చి చేద్దామనుకుంటే కష్టాల ఊబిలో ఉన్న ఈ గుమస్తాగాడే కావాలంటావేమిటి?'' అన్నారు పెద్దవాళ్ళు.

''లక్షలు సంపాదించేవాడే లక్షణమైనవాడు కాదు'' అంది.

''అతణ్ని చేసుకుంటే నువ్వు మా అమ్మాయివే కాదనుకుంటాం'' అన్నారు.

''మీరు కాదనుకుంటే నేను కావాలానుకున్నా కుదర్దుగా. సరే!'' అంది.

''ఇది నిజ జీవితం. సినిమా కాదు. ఈ ప్రేమగీమా రేపు కడుపు మాడితే కానీ తెలిసిరాదు. అప్పుడు అమ్మా నాన్నా అంటూ రావడానికి వీలు లేదు. ఆలోచించుకో'' ఆఖరు ప్రయత్నంగా భయం బూచిని ప్రదర్శింపచూసారు.

చిన్నగా ఓ నవ్వు నవ్వి శంకరం వెంట నడిచి వచ్చేసింది. ఈ చిరునవ్వే ఆ భయం బూచిని ఎదుర్కొనే అస్త్రం అని తేల్చి చెప్పేసినట్టుగా అంతే! అమ్మా నాన్నా, అన్నలూ, వదినలూ తాలూకు వివరాలు వీళ్ళ ద్వారా వాళ్ళ ద్వారా వింటోంది కానీ ఆ ఇంట్లో పునఃప్రవేశం చేయలేదు.

అటునుండి ఒక క్షణానికైనా ఇటు రాలేదు.

''అమ్మా! ఉదయం నుండి ఏమీ తీసుకోలేదు. ఈ కాస్త హార్లిక్స్ తాగు. మనం ఎంత ఏడ్చినా నాన్నగారు ఇంక రారుగా'' అంటోంది ఫోనులో తండ్రి మరణవార్త విని ఉదయమే హుటాహుటిన భర్తతో కలసివచ్చిన కూతురు.

నిర్లిప్తంగా కూతుర్ని చూస్తూ ఉండిపోయింది సునంద. రెండంటే రెండురోజులక్రితం కూతుర్ని తలచుకుని భర్తతో కలసి మురిసిపోయిన క్షణాలు కళ్ళల్లో మెదిలాయి.

• • •

''సున్నీ! అమ్మాయి ఫోన్ చేసింది. అల్లుడికి ఆఫీసర్ ప్రమోషనొచ్చిందిట'' అంటూ హడావుడిగా వచ్చాడు శంకరం ఆ సాయంత్రం.

''అలాగా! దానికంటే మీరే ఆత్రంగా ఎదురు చూస్తూ ఉండేవారు. చల్లటి వార్త చెప్పారు. ఉండండి కాఫీ తీసుకుని వస్తా''నంది సునంద భర్త సంతోషంలో పాలుపంచుకుంటూ.

''సున్నీ నా అంత అదృష్టవంతుడు ఎవరూ ఉండరనిపిస్తోంది'' అన్నాడు శంకరం, సునంద ఇచ్చిన కాఫీ చప్పరిస్తూ.

''అలాగా! ఎందుకనో?'' అతని పక్కనే కూర్చుంటూ అంది సునంద.

''అపురూపమైన ఈ అందాలరాశి సహచర్యం, రత్నాల్లాంటి పిల్లలిద్దరూ, ఎన్ని జన్మల పుణ్యఫలమో! కాదంటావా?'' కాఫీ కప్పు పక్కనపెట్టి ఆమె చెంపల్ని అరచేతుల్లోకి తీసుకుని కళ్ళల్లోకి ప్రేమగా చూస్తూ అన్నాడు.

''అమ్మో కవిత్వం పుట్టుకొస్తోంది'' కిలకిలా నవ్వుతూ అంది సునంద. ఆమె అలా నవ్వుతూ వుంటే పాతిక సంవత్సరాలక్రితం సునందకీ ఇప్పటి సునందకీ అస్సలు తేడా ఉన్నట్టే అనిపించదు శంకరానికి.

''అనుకున్నవన్నీ ఒక్కటొక్కటిగా సాకారమౌతూ ఎదుట కనిపిస్తుంటే ఆనందమయమైన మనసు పొరలలోంచి వచ్చే మాటలు- ఎదుటివారికి అలాగే అనిపిస్తాయేమో'' సోఫా వెనక్కి చారగిలబడి సీలింగ్‌వైపు చూస్తూ అన్నాడు శంకరం ఖాళీ కప్పు భార్యకందించి.

''ఈ రోజు మీ మాటలు వింటుంటే ఆకలి తీరిపోయేటట్టుంది. వంటావార్పూ మానేసి మీ మాటలు వింటూ గడిపేస్తాను ఈ సాయంత్రం అంతా!''

''సున్నీ! అబ్బాయి కలెక్టర్ అవబోతున్నాడు. అల్లుడికి ఆఫీసర్ హోదా వచ్చింది. మన ఇంటి కోసం స్థలం రిజిస్ట్రేషన్ అయిపోయింది. రేపు హౌసింగ్ లోను రాగానే ఇంటి పని మొదలవుతుంది. కోరికలన్నీ ఏకకాలంలో తీరుతున్నాయి. కానీ...కానీ... వీటన్నిటి కోసం సుఖాలన్నింటినీ తృణప్రాయంగా త్యజించి నాతోపాటు రెండున్నర దశాబ్దాలు కష్టాల కడలిలో ఈదుతూ నిశ్శబ్ద జీవనపోరాటం సలిపిన ఈ అమృతమయికి ఏమిచ్చుకుని రుణం తీర్చుకోను?'' శంకరం కళ్ళు చెమ్మగిల్లాయి.

''ఛ...ఏమిటండీ మీరు మరీ సెన్సిటివ్ అయిపోతున్నారు?'' పమిట కొంగుతో అతని కళ్ళు తుడుస్తూ అంది సునంద. శంకరాన్ని అంత ఉద్వేగంలో ఎప్పుడూ చూడలేదు ఆమె.

''మన మొదటి రాత్రి నేనో మాటన్నాను మీకు గుర్తుందా?'' మళ్ళా సునందే అంది శంకరానికి దగ్గరగా జరుగుతూ.

''క్యూ పక్కన యూ'?'' ఆమె కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు శంకరం.

''క్యూ పక్కన యూలా మీతోనే ఉంటానన్నాను. ఎన్ని కష్టాలెదురైనా సరే. మరచిపోయారా? అయినా భర్తతోనే భార్య ఉండడం, సూర్యుడు తూర్పున ఉదయించడం ఎంత సహజమో అంతే సహజం. ఇందులో నా ప్రత్యేకతంటూ ఏమీలేదు. మిమ్మల్ని మీరు ఎందుకు తక్కువగా ఊహించుకుంటారు?'' శంకరాన్ని మామూలు మూడ్‌లోకి తేవాలని సునంద ప్రయత్నం.



''నిజమే సునందా! సంప్రదాయబద్ధంగా పెద్దల సమక్షంలో అందరి ఆశీస్సులతో భార్యాభర్తలైన వారికి నువ్వన్న మాటలు వర్తిస్తాయి. కానీ మనం అలా కాదుకదా. ఎంతటి ప్రతికూల పరిస్థితుల్లో దంపతులమయ్యాం? ఎన్ని అవాంతరాలను ఎదుర్కొన్నాం ఈ పాతికేళ్ళ జీవితంలో?''

''చూడండి! ఏ పరిస్థితుల్లోనైతేనేం మనం భార్యాభర్తలమేకదా! మరి భార్యాభర్తలయ్యాక కష్టాలనైనా సుఖాలనైనా కలసి పంచుకోవాలి. నేనేదో త్యాగం చేసి ఉద్ధరించాననుకుంటారెందుకు?'' దృఢంగా అంది సునంద.

''నువ్వు ఎన్నయినా చెప్పు. నీ మాటకి నువ్వు అచంచలమైన విశ్వాసంతో కట్టుబడి, అతి ధైర్యంగా నిలబెట్టుకున్నావంటాను. ఎటొచ్చీ నేనే నీకిచ్చిన మాటనింతవరకూ నిలబెట్టుకోలేకపోయాను. ఆ రోజు కోసమే ఆతృతగా ఎదురుచూస్తున్నాను.''

''ఏ రోజండీ అది?'' సునంద భృకుటి ముడిపడింది.

''నీకు కన్నవారి మమకారం దూరం చేసాను. వాళ్ళ అనురాగం నీకు మళ్ళా లభ్యమైన రోజు నిజంగా నాకో పెద్ద పండుగరోజే సుమా!'' దీర్ఘంగా నిట్టూర్చాడు శంకరం.

''అందర్నీ మీలో చూసుకుంటున్నాను. నాకే లోటూ లేదండీ. మీరీ ఆలోచనలు మాని ఇక లేవండి అమ్మాయికి ఫోన్ చేసి వద్దాం'' అంది సునంద ఆ సంభాషణ ఇంక పొడిగించడం ఇష్టంలేక.

• • •

చీకటిపడింది.

కొడుకు ఆ రాత్రికి చేరుకుంటాడు కనుక శంకరం దహనం సంస్కారాలు మర్నాటికి వాయిదా వేసారు.

'భజగోవిందం... భజగోవిందం' వసారాలో భజన సాగుతోంది. ఆ రాత్రి అందరికీ జాగారమే మరి!

పాతిక సంవత్సరాల క్రితం వదులుకున్న సునంద తల్లిదండ్రులు శంకరం మరణవార్త విని వచ్చారు. ఎంత కాదనుకున్నా రక్తం పంచుకుని పుట్టిన పిల్ల. పేగు ఎంచుకుని పుట్టిన బిడ్డ పుట్టెడు దుఃఖంలో వుంటే కదలని కన్నపేగుంటుందా? కూతుర్నీ, మనవరాలినీ చూసి చలించిపోయారు.

తల్లి ఒడిలో తల పెట్టుకుని అచేతనావస్థలో ఉన్న శంకరాన్ని చూస్తూ ఉండిపోయింది సునంద.

''మహానుభావుడు మాట మీరని మనిషి. అందరి మంచిని ఎప్పుడూ కోరేవాడు. అంతా అయిపోయింది. తనువు చాలించేసాడు. ఏముందిక? ఈ రాత్రి గడిచిపోతే రేపటికి రెండోరోజు అప్పుడే'' మృత్యువేదాంతం వల్లె వేస్తున్నారు చుట్టూ చేరిన జనం.

''మాట మీరని మనిషి... మాట మీరని మనిషి శంకరం'' సునంద చెవుల్లో అవే మాటలు ప్రతిధ్వనిస్తున్నాయి.

కన్నవారి మమకారం త్వరలో చేకూరస్తానన్న మాట తనువు చాలించి మరీ నిలబెట్టుకున్నాడు. అవును, శంకరం నిజంగా మాట మీరని మనిషే. తన చివరి కోరిక తీరిందని కాబోలు ప్రసన్నంగా ఉంది అతని వదనం. దీర్ఘనిద్రలో వున్న శంకరాన్నే చూస్తోంది సునంద. పరిసరాలు గమనించే స్థితిలో లేదు.

'క్యూ పక్కన యూ' శంకరానికిచ్చిన మాట గుర్తుకొచ్చింది. మెల్లగా కళ్ళు మూసుకుంది తల్లి ఒడిలోనే. మూసిన కళ్ళు మరి తెరుచుకోలేదు.

తండ్రి తల దగ్గర వెలుగుతున్న దీపం ఆరిపోకుండా ప్రమిదలో నూనె వేస్తోంది కూతురు. జ్యోతి ఆరిపోకుండా నూనె వేయగలం, గాలిని స్తంభింపజేయగలం.

కానీ కొండెక్కిపోతూ ఘనం అయిపోతున్న జీవన జ్యోతిని ఆపే ఇంధనం ఏది? జీవాత్మ పరమాత్మ సాన్నిధ్యం కోసం ఆరాట పడుతూ గాలి తెరలపై తేలుతూ ఎగిసిపోతుంటే బంధించే శక్తీ, ఆ మహాప్రస్థానానికి అడ్డు నిలిచే శక్తీ ఎవరికుంది?

ఒకదానికోసం ఒకటి తపించే రెండు జీవాత్మలూ ఒకదాని వెంబడి ఒకటి పరమాత్మలో తాదాత్మ్యం చెందుతాయి అపురూపమైన పుణ్య తిథిగా ఆ దినాన్ని మిగిల్చి.

''పునరపి జననం... పునరపి మరణం'' వసారాలో భజన బిగ్గరగా సాగుతూనే వుంది.

★